సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 8 । జనవరి । 2025

I



నేడు విశాఖలో మోదీ షో

రూ.2 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన

II

న్యూస్‌రీల్

ఇద్దరు అంగన్‌వాడీ కార్యకర్తల సస్పెన్షన్

సాక్షి,పాడేరు: విధుల పట్ల నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై జిల్లాలోని ఇద్దరు అంగన్‌వాడీ కార్యకర్తలను కలెక్టర్ దినేష్‌కుమార్ మంగళవారం సస్పెండ్ చేశారు. గూడెంకొత్తవీధి మండలం కొత్తవాడు గ్రామంలో బాలింత కిండేరి దీన మృతి చెందినప్పటికి టేక్ హోం రేషన్ ఆమె కుటుంబ సభ్యులకు పంపిణీ చేసిన బూరుగుపాలెం అంగన్‌వాడీ కార్యకర్త జి.రాజ్యలక్ష్మిపై ఆయన చర్యలు తీసుకున్నారు. అంతేకాకుండా కొయ్యూరు మండలం రెల్లలపాలెంలో బాలింత డూరి కృష్ణకుమారి మృతిచెందినప్పటికీ రేషన్‌ను బంధువులకు పంపిణీ చేయడంపై అంగన్‌వాడీ కార్యకర్తను సస్పెండ్ చేశారు. అలాగే హుకుంపేట మండలం ఉప్ప పీహెచ్‌సీ పరిధిలో మాతాశిశు మరణాలపై సంబంధిత వైద్యసిబ్బందికి నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌వోను కలెక్టర్ ఆదేశించారు.

32 కిలోల గంజాయి స్వాధీనం

- భార్యాభర్తలు అరెస్టు



గంజాయి నిందితులతో పోలీసులు

జి.మాడుగుల: ఏజెన్సీల్లో కొనుగోలు చేసిన గంజాయిని మైదాన ప్రాంతాలకు ద్విచక్రవాహనంపై తరలిస్తున్న భార్యాభర్తలను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 32 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వారు తెలిపారు. జి.మాడుగుల–పాడేరు రోడ్డు మార్గంలో జీఎం కొత్తూరు జంక్షన్ వద్ద మంగళవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. అటుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా 32 కిలోల గంజాయి పట్టుబడింది. తరలిస్తున్న భార్యాభర్తలు కిల్లో సుబ్బారావు, కిల్లో జ్యోతిని అదుపులోకి తీసుకున్నారు. స్కూటీ, గంజాయిని సీజ్ చేశారు. నిందితుల ఇద్దరిపై ఎన్‌డీపీఎస్ చట్టం–1985 కింద కేసు నమోదు చేసి కోర్టు ఎదుట హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు స్థానిక పోలీసులు తెలిపారు.

హెచ్‌ఎంపీవీ పట్ల ఆందోళన వద్దు

కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ)పై జిల్లా ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. వైరస్‌పై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రచారం, వదంతులపై వైద్యాధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హ్యూమన్ మెటా న్యూమో వైరస్‌పై చిన్నపిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని, తగిన విధంగా నివారణ పద్ధతులను అవలంభించాలని సూచించారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లే సమయంలో మాస్కులు ధరించాలని, ప్రతి ఒక్కరు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇది సాధారణ వైరల్ ఇన్‌ఫెక్షన్ మాత్రమేనని, అయితే ఏ రకమైన వైరస్ సోకినా జాప్యం చేయకుండా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యసేవలు పొందాలని సూచించారు. అన్ని పీహెచ్‌సీలకు తగిన స్థాయిలో మాస్కులు పంపిణీ చేయాలని డీఎంహెచ్‌వో, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్,డీసీహెచ్‌ఎస్‌లను కలెక్టర్ ఆదేశించారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. దీంతో చలి, మంచు తీవ్రత అధికంగానే ఉంటోంది. మంగళవారం జి.మాడుగులలో 9.2 డిగ్రీలు, డుంబ్రిగుడలో 11.0 డిగ్రీలు, జీకేవీధిలో 11.4 డిగ్రీలు, పాడేరులో 11.5 డిగ్రీలు, అరకువేలిలో 11.7 డిగ్రీలు, పెదబయలులో 12.3 డిగ్రీలు, చింతపల్లిలో 12.5 డిగ్రీలు, హుకుంపేటలో 12.6 డిగ్రీలు,కొయ్యూరులో 14.0 డిగ్రీలు,అనంతగిరిలో 15.0 డిగ్రీలునమోదు అయ్యాయి. అంతేకాకుండా ముంచంగిపుట్టులో 19.0డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.



జోరా అంటూ వంగి నమస్కరించుకుంటున్న నేస్తాలు

జోరా.. అంటూ ఆత్మీయత

ఏడాదికి ఒకమారు జనవరి నెలలో వచ్చే సంక్రాంతి పండగను పురస్కరించుకుని జరిగే సంతకు ప్రజల నుంచి విశేష ఆదరణ ఉంది. సంతకు వచ్చిన నేస్తపు(వరసకు అన్నదమ్ములు) చుట్టాలు తారసపడినప్పుడు మర్యాదపూర్వకంగా వంగి 'జోరా'అంటూ నమస్కరించుకుని, యువకులు ఆలింగనం, కరచాలనంతో అప్యాయతగా పలకరించుకుని పండగకు అహ్వానించుకున్నారు. ఈ వారపు సంతను ప్రజాప్రతినిధులు, పలు రాజకీయ నాయకులు సందర్శించారు. తారుమారు సంతలో సుమారు రూ. కోటి మేర వ్యాపార లావాదేవీలు జరిగినట్టు అంచనా.



జి.మాడుగులలో జరిగిన తారుమారు (పండగ) సంత వచ్చిన జనం

కిక్కిరిసిన జి.మాడుగుల రోడ్లు

పండగ సంతకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో జి.మాడుగుల నుంచి దేవుని గెడ్డ, నుర్మతి జంక్షన్ రోడ్డు వరకు కిక్కిరిశాయి. తారుమారు సంతకు సుమారు 15 వేల నుంచి 20 వేల మంది వచ్చినట్లు అంచనా. పండగ సంతలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాలను దారిమళ్లించి పోలీసులు తగు చర్యలు చేపట్టారు.

మండల కేంద్రమైన జి.మాడుగులలో నిర్వహించిన తారుమారు సంత గిరిజనుల మధ్య అనుబంధం, ఆప్యాయతలకు వేదికగా నిలిచింది. ఇతర ప్రాంతాల్లో ఉండే బంధువులు, కుటుంబ సభ్యులు ఈ సంతలో కలుసుకుని ఒకరినొకరు మర్యాదపూర్వకంగా వంగి 'జోరా'అంటూ నమస్కరించుకుని అప్యాయంగా పలకరించుకున్నారు. తమతో తీసుకొచ్చిన యుక్త వయసు పిల్లలను ఒకరినొకరు పరిచయాలు చేసుకుని బంధుత్వాల గురించి ముచ్చటించారు. వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చి విక్రయించారు. సంక్రాంతి పండగకు అవసరమైన నిత్యావసరాలు, వస్త్రాలు కొనుగోలు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో సంత ప్రాంగణం సందడిగా మారింది.

బాగున్నారా.. కుశలమా

అనుబంధం, ఆప్యాయతలకు వేదికగా తారుమారు సంత

- దూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా తరలివచ్చిన గిరిజనులు
- జోరా అంటూ ఆప్యాయంగా పలకరింపు
- బంధుత్వాల ముచ్చట్లు
- నిత్యావసరాలు, వస్త్రాల కొనుగోలు
- జి.మాడుగులలో సందడి

జి.మాడుగుల: ఆదివాసీ గిరిజన సంప్రదాయబద్ధంగా మంగళవారం తారుమారు (పండగ) సంత జరిగింది. ఏటా మాదిరిగానే మండల కేంద్రంలోని వెంకటరాజు ఘాట్ వద్ద పంట పొలాల్లో మంగళవారం నిర్వహించారు. జిల్లాతోపాటు, అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన వస్త్ర దుకాణదారులు, నిత్యావసర, తదితర రకాల వ్యాపారులు వచ్చారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన రైతులు రాజ్‌మా చిక్కుళ్లు, పసుపు, అల్లం, పిప్పలి, **అడ్డాకులు, కొండచీపుర్లు, నాగలి దుంపలు, కూరగాయలు తదితర అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చి విక్రయించారు. కోళ్లు, మేకలు, గొర్రెలు** పశువులను ఇక్కడ వారపు సంతలో విక్రయించారు.

- గిరిజన తండాల నుంచి పిల్లలు, వృద్ధులతో పాటు కుటుంబ సమేతంగా సంతకు తరలి వచ్చా రు. గిరిజనులు తీసుకొచ్చిన అటవీ వ్యవసాయోత్పత్తులు వారపు సంతలో విక్రయించగా వచ్చిన సొమ్ముతో సంక్రాంతికి అవసరమయ్యే నిత్యావసర సరకులు, ఇతర సామగ్రి, కుటుంబ సభ్యులకు కొత్త దుస్తులు కొనుగోలు చేశారు.

పెళ్లి సంబంధాల వేదికగా..

ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు, స్నేహితులు, గిరిజన కుటుంబాలు తమతో తీసుకొచ్చిన యుక్త వయసు పిల్లలను ఒకరినొకరు పరిచయాలు చేసుకొని బంధుత్వాలు గురించి ముచ్చటించారు. గిరిజనులకు ఇష్టమైన జీలుగకల్లు, మడ్డి కల్లు వంటి మత్తు పానీయాలు కొనుగోలు చేసుకుని ఆయా కుటుంబ సభ్యులందరు ఒక చోట చేరి విందు(పార్టీలు) చేసుకున్నారు. బంధుత్వాలు కుదుర్చుకున్న గిరిజన ప్రజలు, పీవీటీజీ తెగల వారు సంక్రాంతి పండగకు ఒకరినొకరు ఆహ్వానించుకున్నారు.

కుండలకు పెరిగిన గిరాకీ

సంక్రాంతి పండగ సందర్భంగా పితృదేవతలకు కొత్తకుండలో పులగం తయారుచేసి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి గిరిజన కుటుంబానికి కొత్త కుండలు అవసరం ఉండటంతో కుండల తయారీ, అమ్మకందారులు సంతలో ధరలు విపరీతంగా పెంచారు. ఒక్కొక్క పిడత, కుండకు రూ.100 నుంచి రూ.120 ధర పలికింది. అధిక ధరలు అయినా గిరిజనులు సంక్రాంతి పండగకు కొత్తకుండ తప్పనిసరి కావడంతో వారికి అవసరమయ్యే కొత్తకుండల (మట్టివి)ను కొనుగోలు చేసి తీసుకువెళ్లారు.



సంతలో కొత్త దుస్తులు, ఇత్తడి, తదితర సామగ్రిని కొనుగోలు చేస్తున్న గిరిజనులు

యోగక్షేమాలు తెలుసుకున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు తారుమారు సంతను సందర్శించారు. ప్రజలు,స్నేహితులు, బంధువులతో ముచ్చటించారు. సంతకు వచ్చి న అందరినీ పలకరిస్తూ యోగక్షేమాలను తెలుసుకున్నారు. వ్యాపారులతో మాట్లాడారు. మట్టి కుండలను **పరిశీలి**ంచిన ఆయ న కొనుగోలు చేశారు. పార్టీ శ్రేణులతో కలిసి శ్రేణులతో ఎమ్మెల్యే కలియతిరిగారు. వైఎస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ బ్రహ్మలింగం, వైఎస్సార్‌సీపీ నాయకులు పండన్న, అంద్రయ్య, కల్యాణం, సూరి బాబు, లక్ష్మినాయుడు, కొండబాబు పాల్గొన్నారు.



తారుమారు సంతలో గిరిజనులతో ముచ్చటిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పండగ దుస్తులు కొనుగోలు చేశా



తారుమారు సంతకు భార్యభర్తలిద్దరం వ్యవసాయ ఉత్పత్తులు తీసుకువెళ్లి విక్రయించాం.బంధువులను, స్నేహితులను కలుసుకున్నాం. సంతకు వచ్చిన మా అమ్మాయి, అల్లుడుకు కొత్త బట్టలు కొని ఇచ్చాం. సంక్రాంతి పండుగకు రమ్మని పిలిచాం. బంధువులను కలుసుకోవడం సంతోషంగా ఉంది.

– **రాజుబాబు**, గడుతూరు, జి.మాడుగుల మండలం.

పిల్లల పెళ్లి సంబంధాలు మాట్లాడా



వెంకటరాజ్ ఘాట్ వద్ద జరిగిన వారపు సంతకు కుటుంబ సభ్యులతో వెళ్లా. పా డేరు, పెదబయలు, చింతపల్లి, జి. మాడుగుల మండలాల నుంచి వచ్చి న బంధువులు, స్నేహితులను కలుసుకున్నాం. వారి తో పిల్లల పెళ్లి సంబంధాల గురించి మాట్లాడా. వారిని సంక్రాంతి పండుగకు ఆహ్వానించా.

–**వండ్లాబు దేముళ్లనాయుడు**, గొడ్డుబూసులు, జి.మాడుగుల మండలం

నిబంధనలకు విరుద్ధంగా పీసా కమిటీ ఎన్నిక

- కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సేరుబయలు గ్రామస్తులు


పాడేరు: నిబంధనలకు విరుద్ధంగా పీసా కమిటీని ఏకపక్షంగా ప్రకటించారని మండలంలోని కిండంగి పంచాయతీ సేరుబయలు గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈనెల 5న తమ గ్రామంలో నిర్వహించిన పీసా కమిటీ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా జంపరంగి సింహాచలం, ప్రధాన కార్యదర్శిగా కూడా నూకరాజు గెలుపొందారన్నారు. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను ఎన్నికల అధికారి గుడిసా ప్రసాద్, వీఆర్వో పలాసి పద్మ, పంచాయతీ కార్యదర్శి ప్రియదర్శిని వారికి అందజేశారన్నారు. కానీ కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గి మంగళవారం గ్రామంలో ఎవ్వరికి సమాచారం ఇవ్వకుండా ఓడిపోయిన అభ్యర్థులను గెలిచినట్లుగా ఎన్నికల అధికారులు ప్రకటించారన్నారు. ఈ నెల ఐదున నిర్వహించిన ఎన్నికల సమయంలో రాని గ్రామస్తులతో సంతకాలు చేయించుకుని ఏకపక్షంగా ప్రకటించారని ఆరోపించారు. ఈ విషయంపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి తొలుత 5వ తేదిన జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన వారిని ఉపాధ్యక్షుడు, కార్యదర్శిగా కొనసాగించాలని కోరారు.

అధికార పార్టీకి అనుకూలంగా ఎన్నికల అధికారి..

కొయ్యూరు: శరభన్నపాలెం పీసా కమిటీ ఎన్నికల అధికారి నిబంధనలను పక్కనబెట్టి అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరించారని మంగళవారం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఓటర్లు ఫిర్యాదు చేశారు. ఈనెల మూడున శరభన్నపాలెంలో పీసా కమిటీ ఎన్నిక జరగలేదు. కౌంటింగ్ జరిగిన తరువాత రెండు ఓట్లు తేడా రావడంతో రీకౌంటింగ్ నిర్వహించాలని మరో వర్గం డిమాండ్ చేసింది. దీనిని సోమవారానికి వాయిదా వేశారు. తిరిగి ఎన్నిక నిర్వహిస్తామని చెప్పిన ఎన్నికల అధికారి సోమవారం ఎన్నిక నిర్వహించకుండా ఓట్ల లెక్కింపులో ఒకరికి ఎక్కువగా వచ్చాయని ప్రకటించారన్నారు. దీనిపై ఆగ్రహం చెందిన ఓటర్లు ఎన్నికల అధికారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇలావుండగా మంగళవారం ఎన్నిక జరుగుతుందని శరమండ, దద్దుగుల తదితర దూర ప్రాంతాల నుంచి మహిళలు కాలినడకన వచ్చారు. దీనిపై ఎంపీడీవో ప్రసాద్‌ను వివరణ కోరగా ఈనెల మూడు జరిగిన ఎన్నికల్లో ఎవరికైతే ఓట్లు ఎక్కువ వచ్చాయో వారిని సోమవారం ప్రకటిస్తామని తెలిపామన్నారు.తిరిగి ఎన్నిక నిర్వహిస్తామని చెప్పలేదన్నారు. కోరం లేని కారణంగా రాజేంద్రపాలెంలో మంగళవారం రెండోసారి జరిగిన ఎన్నిక వాయిదా పడిందన్నారు.



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న సేరుబయలు గ్రామస్తులు



ఎన్నికల అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు

10న ఆర్‌ఐటీఐలో జాబ్‌మేళా

అరకులోయ టౌన్: స్థానిక ప్రభుత్వ ఆర్ ఐటీఐలో ఈనెల 10న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి. రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో అపోలో ఫార్మసీ, మూత్తూట్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్ కంపెనీలు పాల్గొంటాయని ఆమె పేర్కొన్నారు. టెన్త్ పాసై డిగ్రీ చదివిన 18 ఏళ్ల నిండిన 30 ఏళ్ల లోపు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువపత్రాల నకళ్లతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆమె సూచించారు. జాబ్ మేళాలో ఎంపికైన వారికి నెలకు రూ. 10 వేల నుంచి రూ. 16 వేల వేతనం అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు 94910 57527, 93983 38105 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

రిక్వెస్ట్ స్టాప్ వద్ద పాసింజర్ రైళ్లు ఆపాలి

అరకు ఎంపీ, కలెక్టర్‌కు ఆటో కార్మిక సంఘ నేతల వినతి

సాక్షి,పాడేరు: అరకులోయ పట్టణ పరిధిలోని రైల్వే రిక్వెస్ట్ స్టాప్ వద్ద పాసింజర్ రైళ్లను నిలిపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్, అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణికి ఆటో కార్మికసంఘం నేతలు వినతిపత్రం అందజేశారు.వారంతా మంగళవారం పాడేరులో కలెక్టర్, ఎంపీలకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. గత డిసెంబర్ 31వతేదీ వరకు రిక్వెస్ట్ స్టాప్ వద్ద పాసింజర్ రైళ్లను నిలిపారని, ఈఏడాది జనవరి ఒకటి నుంచి రైళ్లను నిలపకపోవడంతో తామంతా ఉపాధి కోల్పోతున్నామని వాపోయారు. పూర్వం నుంచి ఉన్న రైల్వే రిక్వెస్ట్ స్టాప్ వద్ద పాసింజర్ రైళ్ల నిలిపివేతను రద్దు చేయడం అన్యాయమని, స్థానిక ప్రజలు, పర్యాటకులకు కూడా ఇబ్బందిగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైళ్లను నిలపడంతో పాటు ఫ్లైవోవర్, ప్లాట్‌ఫారంలను అభివృద్ధి చేయాలని వారు కలెక్టర్,ఎంపీలను కోరారు. విశాఖలోని రైల్వే డీఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్, ఎంపీలు వారికి హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం నాయకులు రమేష్,చిన్న,ఎల్లారావు, బాషా, వసంత్,కృష్ణరాజు, శ్రీను,శంకర్,రామన్న పాల్గొన్నారు.



అరకు ఎంపీతనూజరాణికి వినతిపత్రం అందజేస్తున్న ఆటోకార్మిక సంఘం నేతలు

పెండింగ్ నిర్మాణ పనులు పూర్తి చేయండి

- మార్చి నెలాఖరు వరకు గడువు
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం
- మాతాశిశు మరణాలు సంభవిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఇంజనీరింగ్ పనులను ఈఏడాది మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో రహదారులు, భవన నిర్మాణాలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టికల్ 275, సీసీడీపీ, ఉపాధి హామీ పథకాల్లో మంజూరు చేసిన పనులన్నింటిని నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలన్నారు.అరకు పరిధిలో 24పనులకు ఒకటి మాత్రమే పూర్తిచేశారని,మిగిలిన 23 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. చింతూరు,రంపచోడవరం డివిజన్‌ల పరిధిలో ఆర్టికల్ 275 పథకంలో మంజూరు చేసిన పనులు కూడా మార్చి నాటికి పూర్తి చేయాలని, పనులు ప్రారంభించని కాంట్రాక్టులను రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. పాడేరు గిరిజన సంక్షేమడివిజన్ పరిధిలో 66 పనులు మంజూరు చేయగా, 48పనులు పురోగతిలో ఉన్నాయని, మిగిలిన పనులు కూడా వెంటనే చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గిరిజన సంక్షేమశాఖ ఈఈలు కె.వేణుగోపాల్, డేవిడ్‌రాజు, సీపీవో ఎస్‌ఎస్‌ఆర్‌కే పట్నాయక్, వర్చువల్‌గా రంపచోడవరం,చింతూరు డివిజన్‌ల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

మాతాశిశు మరణాలను ఉపేక్షించేది లేదు

మాతా శిశుమరనాలు సంభవిస్తే ఉపేక్షించేది లేదని, ఇందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జర్రెల, డొనూరు. గెమ్మెలి, ధారకొండ, డుంబ్రిగుడ, ఆర్‌వీ నగర్, ఉప్ప ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన మాతృ మరణాలపై ఆయన సమీక్షించారు. గిరిజనులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. హైరిస్క్‌తో పాటు ఇతర గర్భిణులను ప్రసవ సమయానికి 10 రోజుల ముందుగానే బర్త్ వెయిటింగ్ హాళ్లకు తరలించి సుఖ ప్రసవాలు జరిగేలా వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆశాలు, అంగన్‌వాడీలు, ఎఎన్ఎంలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆస్పత్రులలో ప్రసవాలు పెరిగేలా ప్రణాళికపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణారావు, సీడీపీవోలు పాల్గొన్నారు.

జన్‌మన్ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

జిల్లాలో ప్రధానమంత్రి జన్‌మన్ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు.మంగళవారం తన కార్యాలయం నుంచి గృహనిర్మాణం, డీఆర్‌డీఏ, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి హామీ పథకం పనులపై ఎంపీడీవోలతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 23,654 గృహాలు మంజూరు చేయగా, ఇప్పటికి 17,382 మాత్రమే ప్రారంభించారన్నారు. మిగిలిన 6272 ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని సూచించారు.అర్హత కలిగిన సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వాలన్నారు. స్త్రీనిధి చెల్లింపుల్లో జాప్యం చేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఉపాధి పథకంలో లేబర్ మొబలైజేషన్ పెంచాలని, ఉపాధి పనులు కల్పించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలంతా స్థానికంగా అందుబాటులో ఉండాలని, చిన్న పిల్లల ఆధార్ కార్డుల నమోదును విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. వర్చువల్‌గా పాడేరు,రంపచోడవరం ఐటీడీఏ పీవోలు అభిషేక్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి,పాడేరు: ఏవోబీలోని జామిగుడ రోడ్డులో మెట్టగుడ సమీపంలోని మినీ వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ప్రాజెక్ట్స్ ఇంజనీరింగ్ అధికారులు పూర్తి చేశారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం, రాకపోకలకు గిరిజనుల ఇబ్బందులపై 'నిధులున్నా నిర్లక్ష్యం' శీర్షికన గత నెల 12న ప్రచురితమైన కథనంపై పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ స్పందించారు. అప్రోచ్ రోడ్డుతో పాటు మినీ వంతెన పనులను పూర్తి చేయాలని పీఆర్ ప్రాజెక్ట్స్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత కాంట్రాక్టర్ పనులను పూర్తి చేశారు. దీంతో సీలేరు, ధారకొండ, ఒడిశాలోని చిత్రకొండ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు.



పూర్తయిన అప్రోచ్ రోడ్డు, మినీ వంతెన

నేడు విశాఖలో మోదీ షో



ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు పక్కా ఏర్పాట్లు
రూ.2 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన

- సాయంత్రం 4.30 గంటలకు విమానాశ్రయానికి రాక
- సిరిపురం నుంచి ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ వరకు రోడ్‌షో
- బహిరంగ సభకు భారీగా జనసమీకరణకు ఏర్పాట్లు
- 5 వేల మందితో భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీస్ శాఖ
- ఏయూ పరిసరాలను ఆధీనంలోకి తీసుకున్న కేంద్ర బలగాలు



ఏయూ గేట్ వద్ద పోలీసు పహారా



రోడ్డు షో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

విశాఖ సిటీ: దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఆయన రోడ్‌షోతో పాటు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. సుమారు రూ.2 లక్షల కోట్ల విలువైన కీలక ప్రాజెక్టులకు ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన జరగనున్నాయి. ఈ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో బస్సులు, ఆటోల్లో ప్రజలను సమీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ శాఖ భారీ భద్రతా చర్యలు చేపట్టింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 5 వేల మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసింది. అలాగే వేల సంఖ్యలో బస్సులు, ఆటోల్లో ప్రజలు వస్తుండడంతో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు. పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించారు.

భారీగా జన సమీకరణ



ప్రధాని సభను కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇదే ఏయూ మైదానంలో జరిగిన ప్రధాని సభకు కనీవినీ ఎరుగని రీతిలో జనాలు తరలి వచ్చారు. దీంతో కూటమి ప్రభుత్వ పెద్దలు ఈ సభపై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర మంత్రులు ఇప్పటికే నాలుగు రోజులుగా జిల్లాలో మకాం వేసి భారీ జన సమీకరణ చేపట్టాలని కూటమి నేతలకు ఆదేశాలు జారీ చేశారు. కేవలం విశాఖ నుంచే కాకుండా విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలలో ప్రజలను తీసుకురావాలని నిర్ణయించారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, ఆటోలను సిద్ధం చేశారు. శ్రీకాకుళం నుంచి 200 బస్సులు, విజయనగరం, పార్వతీపురం నుంచి 400 బస్సుల్లోనే కాకుండా ఉమ్మడి విశాఖ, ఇలా అన్ని ప్రాంతాల నుంచి 2,280 బస్సులు, 2,280 ఆటోలు, 382 మినీ బస్సులు, 150 టాటా మ్యాజిక్‌లలో జనసమీకరణకు ఏర్పాట్లు చేశారు.

ప్రధాని ప్రారంభించనున్న ప్రాజెక్టులు



రాజయ్యపేటలో బహిరంగ వేదిక వద్ద ఏర్పాటు చేసిన టీవీలు

సాక్షి, విశాఖపట్నం : ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటనలో రూ.2 లక్షల కోట్ల విలువైన 30 ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు. దక్షిణ కోస్తా రైల్వేజోన్‌తో పాటు అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద రూ.1.85 లక్షల కోట్లతో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్, నక్కపల్లిలో రూ.1,877 కోట్లతో తలపెట్టిన బల్క్‌డ్రగ్ పార్క్‌ను వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. రూ.1321 కోట్లతో ఆనందపురం మండలంలో వేంపల్లి–దాగలమర్రి రహదారి విస్తరణ, ఎన్‌హెచ్–516 పాడేరు బైపాస్ రోడ్డు నిర్మాణం, రూ. 302 కోట్లతో గంగవరం పోర్టు నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్ వరకూ సుమారు 12 కి.మీ మేర 3, 4 రైల్వే లైన్ల నిర్మాణం, రూ.150 కోట్లతో విశాఖ–గోపాలపట్నం వరకు సుమారుగా 15 కి.మీటర్ల మేర రైల్వేలైన్ నిర్మాణం, రూ.302 కోట్లతో దువ్వాడ–సింహాచలం రైల్వే లైన్ల నిర్మాణం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. చెన్నై–బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా తిరుపతి జిల్లాలో కృష్ణపట్నం పారిశ్రామిక ప్రాంతం(కేఆర్ఐఎస్ సిటీ)కి కూడా శంకుస్థాపన చేయనున్నారు.

రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్

దక్షిణాది రాష్ట్రాలతో పోటీ పడి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాధించిన బల్క్‌డ్రగ్ పార్క్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు ఏర్పాటు కానుంది. గత ఏడాది సెప్టెంబరులో ఈ పార్క్ ఏర్పాటుకు అవసరమైన రెండు వేల ఎకరాల భూములను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించింది. ఈ డ్రగ్ పార్క్ కోసం 17 రాష్ట్రాలు పోటీ పడ్డాయి. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో రాజయ్యపేట పెదతీనార్ల, బోయపాడు, చందనాడ, బుచ్చిరాజుపేట తదితర గ్రామాల పరిధిలో ఈ పార్క్ ఏర్పాటు కానుంది. రసాయన పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు సరఫరా చేసే ప్లాంట్లను ఇక్కడ ఏర్పాటు చేస్తారు.

ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్

అచ్యుతాపురం మండలంలోని పూడిమడక సమీపంలో గ్రీన్ హైడ్రోజన్ ఎన్టీపీసీ పవర్ ప్లాంట్‌కు ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. సుమారు 1600 ఎకరాల విస్తీర్ణంలో రూ.1.85 లక్షల కోట్లతో పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో 20 గిగా వాట్స్ పునరుత్పాదక శక్తి సామర్థ్యంతో పెట్టుబడులు, 1500 టీపీడీ గ్రీన్ హైడ్రోజన్, 7500 టీపీడీ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యంతో (గ్రీన్ మిథనాల్, గ్రీన్ యూరియా, సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ సహా) భారతదేశంలో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి జరుగుతుంది. ఇది పూర్తయితే ఏపీ ప్రపంచంలోనే గ్రీన్ ఎనర్జీలో ల్యాండ్‌స్కేప్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. అదేవిధంగా 57,000 మందికి పైగా ఉపాధి లభిస్తుంది.

రోడ్ షోతో పాటు బహిరంగ సభ



మైదానంలో సభకు జరుగుతున్న ఏర్పాట్లు

ప్రధాని మోదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఢిల్లీ నుంచి విమానంలో సాయంత్రం 4.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 4.45 గంటలకు సిరిపురం ప్రాంతంలోని వెంకటాద్రి వంటిల్లు ప్రాంతానికి వస్తారు. అక్కడి నుంచి జరిగే రోడ్ షోలో పాల్గొంటారు. ఆ రోడ్డులో ఎడమ వైపు వీవీఐపీలకు, కుడివైపు ప్రజలకు కేటాయించారు. ప్రధాని ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు వెళతారు. సాయంత్రం 5.30 గంటలకు ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌కు చేరుకుంటారు. అనంతరం రైల్వే జోన్, బల్క్ డ్రగ్ పార్క్.. ఇలా రూ.2 లక్షలు విలువైన కీలక ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. సభ ముగిసిన వెంటనే రోడ్డు మార్గంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు 6.55 గంటలకు చేరుకుంటారు. సాయంత్రం 7 గంటలకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానంలో భువనేశ్వర్‌కు పయనమవుతారు.

5 వేల మందితో భారీ భద్రత



సిరిపురం వద్ద ప్రధాన రహదారి మూసివేసిన దృశ్యం

ప్రధాని పర్యటన సందర్భంగా పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపడుతున్నారు. కేంద్ర బలగాలు నగరానికి చేరుకొని ఏయూ పరిసర ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఆయా ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నిషేధించారు. ప్రధాని పర్యటించే ప్రాంతాలు రోడ్ షో, బహిరంగ సభ ప్రదేశాల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్లతో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. డ్రోన్ కెమెరాల వినియోగాన్ని నిషేధించారు. మోదీ సభకు భారీగా జనసమీకరణ చేపడుతున్నందున.. 5 వేల మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. 32 మంది ఐపీఎస్ అధికారులను నగరానికి రప్పించారు. అలాగే 18 మంది అడిషనల్ ఎస్పీలు, 60 మంది డీఎస్పీలు, 180 మంది సీఐలు, 400 మంది ఎస్ఐలతో పాటు ఏఆర్, ఇతర సిబ్బందిని వినియోగిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు బస్సులు, ఆటోల్లో సభకు వస్తుండడం ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సాధారణ వాహనాల మళ్లింపులపై పలు సూచనలు చేశారు. డీజీపీ ద్వారకా తిరుమల, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి భద్రతా చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

విస్తృత తనిఖీలు



సిరిపురం వద్ద ట్రాఫిక్‌ను మళ్లిస్తున్న పోలీసులు

ఇప్పటికే నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని హోటల్స్, లాడ్జిలు, రిసార్టులు, గెస్ట్ హౌస్‌ల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో సభ జరిగే ప్రాంతం, వీఐపీ పార్కింగ్‌తో పాటు నగరమంతా స్నిఫర్ డాగ్, బాంబ్ స్క్వాడ్లతో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అన్ని ప్రధాన రహదారులలో ఏఎస్సీ, ఆర్‌ఓపీలు నిర్వహించారు. ముఖ్యమైన ప్రాంతాల్లో పికెట్స్, గార్డులను ఏర్పాటు చేశారు. నగరంలో ఏపీఎస్పీ ప్లటూన్లను మొహరించడంతో పాటు రిజర్వుగా అధికారులు, సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

సభకు 600 బస్సులు

అల్లిపురం: ప్రధానమంత్రి మోదీ సభకు జనాలను తరలించేందుకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 600 బస్సులు వినియోగిస్తోంది. నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ బస్సుల ద్వారా ప్రజలను తరలించనున్నారు. దూర ప్రాంతాలకు 60 బస్సులు నడుపుతున్నారు. మిగిలిన బస్సులు డిపోలకే పరిమితం కానున్నాయి. బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ సిటీ, సబర్బన్, మెట్రో సర్వీసులు దాదాపు నిలిచిపోనున్నాయి. ఇవి కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా బస్సుల్లో ప్రజలను తీసుకొచ్చేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. జిల్లాకు చెందిన బస్సులతో పాటు, బస్సుల పార్కింగ్ విషయంలో రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అధికారులకు పలు సూచనలు చేశారు.

వాహన రికార్డులు సక్రమంగా ఉండాలి



అడ్డతీగలలో వాహనాల రికార్డులను తనిఖీ చేస్తున్న రంపచోడవరం ఆర్టీవో రాజేష్‌కుమార్

అడ్డతీగల: వాహనదారులు రికార్డులను తప్పనిసరిగా కలిగి ఉండాలని రంపచోడవరం ఆర్టీవో కె.రాజేష్‌కుమార్ అన్నారు. అడ్డతీగలలో మంగళవారం ఆయన విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఆటోలు, కార్లు, ట్రాక్టర్లు, లారీలు వంటి వాటికి పర్మిట్లు తీసుకోవాలన్నారు. ప్రతి వాహనానికి ఇన్సూరెన్స్, పర్మిట్లు, ఫిట్‌నెస్, డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉండాలన్నారు. సంబంధిత పత్రాలు లేనిపక్షంలో కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ఇన్స్యూరెన్స్ లేని వాహనాల్లో ప్రయాణించేటప్పుడు ఏదైనా ప్రమాదానికి గురైతే ప్రయాణికులు, చనిపోయినా లేక తీవ్రంగా గాయపడినా ఇన్స్యూరెన్స్ వర్తించదన్నారు. పర్మిట్లు లేని వారికి వాటిని సమకూర్చుకోవడానికి కొంత సమయం ఇస్తున్నామన్నారు. కొన్ని వాహనాలకు రికార్డులు సక్రమంగా లేనందున కేసులు నమోదు చేసి జరిమానా విధించారు.

10 వాహనాలకు రూ.70 వేలు జరిమానా

అడ్డతీగలలో మంగళవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రికార్డులు సక్రమంగా లేని 10 వాహనాలకు రూ.70 వేలు జరిమానా విధించినట్టు రంపచోడవరం ఆర్టీవో కె.రాజేష్ కుమార్ తెలిపారు. వీటిలో ట్రాక్టర్లు, బొలేరోలు, బైక్‌లు, ఆటోలు ఉన్నాయన్నారు. లైసెన్స్ లేకపోవడం, ఫిట్‌నెస్, ఇన్స్రూ పర్మిట్లు కలిగి ఉండకపోవడం వంటివి గుర్తించి కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్టు ఆయన చెప్పారు.

పండక్కి ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం : పండగల వేళ ప్రయాణికుల సౌకర్యార్థం కాచిగూడ–శ్రీకాకుళం రోడ్–కాచిగూడ, చర్లపల్లి–శ్రీకాకుళంరోడ్–చర్లపలి మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ● కాచిగూడ–శ్రీకాకుళం రోడ్(07615) స్పెషల్ రైలు ఈ నెల 11, 15వ తేదీల్లో కాచిగూడలో సాయంత్రం 5.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 5.45 గంటలకు దువ్వాడకు, ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుటుంది. తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం రోడ్–కాచిగూడ(07616) స్పెషల్ రైలు ఈ నెల 12, 16వ తేదీలలో శ్రీకాకుళం రోడ్‌లో మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడకు మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. ● చర్లపల్లి–శ్రీకాకుళం రోడ్(07617) స్పెషల్ ఈ నెల 8వ తేదీన చర్లపల్లిలో రాత్రి 7.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 5.45 గంటలకు దువ్వాడకు అదేరోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం రోడ్–చర్లపల్లి (07618) స్పెషల్ ఈనెల 9వ తేదీన మధ్యాహ్నం 2.45 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయల్దేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడకు మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

సీతమ్మధార: విశాఖ పర్యటనకు వస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోదీ.. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని రద్దు చేస్తున్నట్లు, సొంత గనులు కేటాయిస్తున్నట్లు, ప్లాంట్‌ను పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించేందుకు అన్ని వనరులు కేటాయిస్తున్నట్లు స్పష్టంగా ప్రకటించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం నేత ఎం.జగ్గునాయుడు, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ సొంత గనుల గురించి ఇప్పటి వరకు నోరు మెదపని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్.. ఏకంగా ఆర్సిలార్ మిట్టల్‌కు ఏజెంట్‌గా మారారని మండిపడ్డారు. కేంద్ర ఉక్కు మంత్రి కుమార్‌స్వామిని కలిసి రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే ఆర్సిలార్ మిట్టల్ స్టీల్ పరిశ్రమకు నిరాటకంగా ముడి ఇనుప ఖనిజం సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారని ఆరోపించారు. ఈ చర్యను సీపీఎం విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. తక్షణం మంత్రి పదవి నుంచి భరత్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానివ్వమని, సెయిల్‌లో విలీనం చేయిస్తామని, సొంత గనులు కేటాయిస్తామని, క్యాపిటల్ రీస్ట్రక్చరింగ్ కింద రూ.18వేల కోట్లు మంజూరు చేయించి చర్యలు చేపడతామని చంద్రబాబు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీని గాలికొదిలేశారన్నారు.

మన్యంలో విజృంభిస్తున్న చలి

- తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- ముంచెత్తుతున్న మంచు
- గిరిజనుల అవస్థలు



మంచులో స్కూల్ బస్ కోసం ఎదురుచూస్తున్న చిన్నారి

డుంబ్రిగుడ: మన్యంలో చలి విజృంభిస్తోంది. గజ గజ చలితో గిరిజనులు వణికిపోతున్నారు. ఉదయం 10 గంటలైనా మంచు తెరలు వీడడం లేదు. మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోతుంది. 3 గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. దీంతో గిరిజనం ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రత అధికంగా ఉన్నా మంచులోనే విద్యార్థులు పాఠశాలలకు వెళ్తున్నారు. గత రెండు వారాలుగా ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోతున్నాయి. చలిలో బయట తిరగొద్దని, అత్యవసర పనుల్లో మాత్రమే బయటకు రావాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



డుంబ్రిగుడలో మంచులోనే చిన్నారిని పాఠశాలకు తీసుకెళ్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: మన్యప్రాంతం రాజవొమ్మంగి పరిసర ప్రాంతాలు చలితో వణికి పోతున్నాయి. పొద్దుపొడుపు కనుపించక, మంచు, చలి స్థానికులను వేధిస్తున్నాయి. అత్యవసర పనులపై వెళ్లాల్సిన వారికి తిప్పలు తప్పడం లేదు. స్కూల్‌కు వెళ్లే పిల్లలు సకాలంలో సిద్ధం కాలేక సతమతమవుతున్నారు. ఉదయం 9 గంటల వరకు చలి మంటల వద్ద సేద తీరుతున్నారు. కురుస్తున్న మంచు వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. లైట్ల వెలుతురులోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఇక వాహనచోదకులు ఆచి తూచి ప్రయాణం సాగిస్తు కనుపించారు. కాగా చలి, ఆహ్లాదకరమైన మంచు వాతావరణానికి ప్రకృతి ప్రేమికులు, మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన సైతం ఫిదా అవుతున్నారు. కొంచెం ఇబ్బంది అయిప్పటికి అరుదైన ఈ వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు.



రాజవొమ్మంగిలో కురుస్తున్న మంచు



చలి మంట వద్ద సేదతీరుతున్న గిరిజనం

మినీ రిజర్వాయర్‌లో జారిపడి గిరిజనుడి మృతి



వెంకటరావు(ఫైల్)

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ కేంద్రంలో ఉన్న మినీ రిజర్వాయర్‌లో మంగళవారం ఉదయం పంచాయిడి వెంకటరావు(44) అనే గిరిజనుడు రిజర్వాయర్ గెడ్డలో పడి మృతి చెందాడు. కొర్రాయి సర్పంచ్ కొములు, మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాలు ఇల్లా ఉన్నాయి.. కొర్రాయి మినీ రిజర్వాయర్ సమీపంలో వెంకటరావు కాలకృత్యాలు తీర్చుకుని ముఖం కడుక్కుంటుండగా ప్రమాదవశాత్తు గెడ్డలో జారి పడిపోయినట్టు తెలిపారు. దీంతో గ్రామస్థులంతా ఎంత వెతికినా మృతదేహం లభించపోవడంతో పాడేరు అగ్నిమాపక సిబ్బందికి వారు సమాచారం అందించారు. ఈ మేరకు గజ ఈతగాళ్లు వచ్చి మినీ రిజర్వాయర్‌లో గాలించి వెంకటరావు మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వారు తెలిపారు. ఈ విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రమాదవశాత్తు మినీ రిజర్వాయర్‌లో జారిపడిన వెంకటరావు కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని వైస్ ఎంపీపీ పంచాడి లలిత డిమాండ్ చేశారు. కుటుంబ పెద్ద మృతితో కుటుంబానికి ఎటువంటి ఆధారం లేకుండా పోయిందన్నారు. బాధిత పేదకుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.



వెంకటరావు మృతదేహం

మ్యూజిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలోని సెయింట్ లూక్స్ ఆడియో ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ విభాగంలో సంగీత సంబంధిత డిప్లమో / పీజీ డిప్లమో సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు మంగళవారం నోటిఫికేషన్ జారీ అయింది. ఆడియో ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్, ఫిల్మ్ ఎడిటింగ్, డబ్బింగ్, ఓకల్–ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ కోర్సులకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ డీఏ నాయుడు కోరారు.

ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సు పోస్ట్ భర్తీకి దరఖాస్తులు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ మైక్రోబయాలజీ విభాగంలో ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సు(ఐసీఎన్) ఉద్యోగం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. హెల్త్ కేర్ అసోసియేటెడ్ ఇన్ఫెక్షన్స్(హెచ్ఏఐ) సర్వైలెన్స్, నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)లో భాగంగా ఈ పోస్టును భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 17లోగా అందజేయాలన్నారు.